సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 7 । ఆగస్టు । 2024



టన్ను చీనీ రూ.19,200
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19,200 పలికాయి. మార్కెట్‌కు 770 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.25
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.25, కనిష్టంగా రూ.16 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.7°/23.4°
జిల్లా పరిధిలో మంగళవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

భూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

- అధికారులకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ ఆదేశం



ముక్తాపురంలో ఇళ్లకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

కనగానపల్లి: గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన, మండలంలోని ముక్తాపురం రెవెన్యూ గ్రామంలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా సర్వే నంబర్ 392–4లోని భూమి ఆర్‌ఓఆర్ వివాదంపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. అనంతరం గతంలో ముక్తాపురం ఎస్సీ కాలనీ సమీపంలో ఇళ్ల పట్టాలకు కేటాయించిన సర్వే నంబర్ 224–4లోని భూమిని పరిశీలించారు. జేసీ వెంట ఆర్డీఓ వెంకటశివారెడ్డి, తహసీల్దార్ రమాదేవి, స్థానిక రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

లేపాక్షి: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లోని మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ రాయపురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 26వ తేదీలోపు https://www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఈనెల 27వ తేదీలోపు దరఖాస్తు చేసుకున్న కళాశాలకు వెళ్లి ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకోవాలన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులన్నారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు 29న, ప్రైవేటు ఐటీఐ కళాశాల్లో ప్రవేశాలకు ఈనెల 31న కౌన్సెలింగ్ ఉంటుందని ఆయన వివరించారు. వివరాలకు 9440285629, 9490445744 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు



దాడుల్లో పాల్గొన్న విజిలెన్స్ అధికారులు

ముదిగుబ్బ: మండల పరిధిలోని సంకేపల్లి పంచాయతీలో మంగళవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులను నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగిస్తున్న 50 మందిని గుర్తించి రూ.5 లక్షల జరిమానా విధించినట్లు అనంతపురం విద్యుత్ విజిలెన్స్ ఏడీలు రామాంజనేయులు, నాగేంద్ర తెలిపారు. అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. దాడుల్లో ఏఈలు జగన్నాథం, అశోక్, చంద్రశేఖర్, మహబూబ్ పీరా తదితరులు పాల్గొన్నారు.

ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి ప్రత్యేక రైలు

గుంతకల్లు: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని కర్నూలు జిల్లాలోని ప్రసిద్ధ క్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు గుంతకల్లు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం మనోజ్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి సెప్టెంబర్ 30 వరకూ గుంతకల్లు–రాయచూరు మధ్య స్పెషల్ ప్యాసింజర్ రైలు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 5.30 గంటలకు గుంతకల్లు జంక్షన్ నుంచి రైలు బయలుదేరుతుందన్నారు.

అనుగ్రహం కొందరికే!

సోమందేపల్లికి చెందిన రసూల్‌కు జగన్ సర్కార్ ఇల్లు మంజూరు చేయడంతో ఉత్సాహంగా నిర్మాణం చేపట్టాడు. అయితే ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత కారణాలతో నిర్మాణం మధ్యలో నిలిపివేశాడు. ఇప్పుడు మళ్లీ ప్రారంభించేందుకు సిద్ధం కాగా, నిర్మాణ వ్యయం భారీగా పెరిగింది. కూటమి ప్రభుత్వం ఇంటికి రూ.4 లక్షలు ఇస్తుందని ప్రకటించడంతో ఎంతో సంబరపడ్డాడు. అయితే గతంలో మంజూరైన ఇళ్లకు ఒక్క రూపాయి అదనంగా ఇవ్వబోమని చంద్రబాబు సర్కార్ తేల్చి చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టే వారికి ఎంత ఖర్చవుతుందో...తనకూ అంతే వ్యయమవుతుందని, అలాంటప్పుడు తనకు మాత్రం ఎందుకు పెంచిన మొత్తం ఇవ్వరని రసూల్ ప్రశ్నిస్తున్నాడు. కానీ ఎవరూ సమాధానం చెప్పడం లేదు.



ధర్మవరం చెన్నకేశపురం వద్ద జగనన్న లేఅవుట్‌లో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు

గూడు కట్టిన వేదన
- ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు
- కొత్తగా ఎంపిక చేసేలబ్ధిదారులకే వర్తింపు
- ఆర్భాటంగా ప్రకటించిన కూటమి ప్రభుత్వం
- గతంలో మంజూరైన ఇళ్లకు 'ధనం' లేదంటున్న వైనం
- తామేం పాపం చేశామంటున్న లబ్ధిదారులు



ధర్మవరంలో సగంలో ఉన్న ఇంటి నిర్మాణం

పుట్టపర్తి: రాష్ట్రంలో గూడు లేని నిరుపేదలే ఉండకూడదన్న ఉద్దేశంతో గత సర్కార్ భారీగా ఇళ్లు మంజూరు చేసింది. ఊరూరా జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి స్థలంతో పాటు ఇంటికీ ఆర్థిక సాయమూ అందజేసింది. దీంతో ఎందరో నిరుపేదలు ఉత్సాహంగా ఇళ్లు నిర్మించుకున్నారు. కానీ ఆర్థిక ఇబ్బందులు, ఇతర సమస్యలతో కొందరు నిర్మాణాలు అర్ధంతరంగా నిలిపివేశారు. మరికొందరు కనీసం పునాదులు కూడా తవ్వ లేదు. తాజాగా ఇంటి నిర్మాణం ప్రారంభిద్దామంటే నిర్మాణ వ్యయం భారీగా పెరిగింది. పోనీ కూటమి ప్రభుత్వం ప్రకటించిన రూ.4 లక్షల మొత్తమైనా వస్తుందనుకుంటే దానికీ మెలిక పెట్టారు. దీంతో గతంలో ఇళ్లు మంజూరై ఇంటి నిర్మాణం పూర్తి చేయని వారంతా ఇబ్బందులు పడుతున్నారు.

కొత్తవారికే పెంచిన మొత్తం

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం యూనిట్ విలువను రూ.4 లక్షలకు పెంచారు. ఇందులో కేంద్రం రూ.2.50 లక్షలు ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారు. ఇంతవరకూ బాగానే ఉన్నా... గతంలో ఇళ్లు మంజూరై వివిధ దశల్లో నిర్మాణాలు ఉన్న వారికి ఈ పథకం వర్తించదని తేల్చి చెప్పారు. గతంలో ఇళ్లు మంజూరై నిర్మాణం ప్రారంభించకపోయినా రూ.1.80 లక్షలే ఇస్తామని చెబుతున్నారు. నిర్మాణ వ్యయం పెరగడం... ఎన్నికల సమయంలో బిల్లులు ఆగిపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను నిలిపివేశారు. వారంతా కూటమి సర్కార్ నిర్ణయంపై పెదవి విరుస్తున్నారు.

40 వేల మంది ఎదురుచూపు

గత సర్కార్ జిల్లాలో 298 జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేసింది. ఆయా లేఅవుట్లతో పాటు సొంత స్థలం ఉన్న వారికి మొత్తంగా 66,393 ఇళ్లు మంజూరు చేసింది. ఇందులో 19,491 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, మరో 39,703 మంది నిర్మాణాలు ప్రారంభించి వివిధ కారణాలతో మధ్యలో నిలిపివేశారు. మరో 7,199 మంది ఇంటి నిర్మాణాలే ప్రారంభించలేదు. దీంతో వీరంతా తమకూ రూ.4 లక్షలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో జిల్లాలోని నియోజకవర్గాల వారీగా మంజూరైన ఇళ్ల వివరాలు

నియోజకవర్గం	మంజూరైన ఇళ్లు	పూర్తయిన ఇళ్లు	నిర్మాణం ప్రారంభంకాని ఇళ్లు
ధర్మవరం	16,172	4,096	2,183
హిందూపురం	11,408	2,667	628
కదిరి	4,783	1,346	676
మడకశిర	1,073	483	243
పెనుకొండ	6,650	3,216	154
పుట్టపర్తి	18,810	5,148	2,731
రాప్తాడు	7,497	2,535	584

66,393
జిల్లాకు మంజూరైన ఇళ్లు

19,491
పూర్తయిన ఇళ్లు

39,703
వివిధ దశల్లో ఉన్న ఇళ్లు

7,199
నిర్మాణాలే ప్రారంభం కానివి

బిల్లులిస్తారో...లేదో..?

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై...వివిధ దశల్లో ఉన్న ఇంటి నిర్మాణదారులంతా ఇప్పుడు సంశయంలో పడిపోయారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసినా ఈ ప్రభుత్వం బిల్లులు ఇస్తుందా అన్న అనుమానం వారిలో మొదలైంది. కొందరు స్థానిక టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ఆ ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్లకు మేమెందుకు డబ్బులిస్తామని చెబుతుండగా... లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.

మేమేం పాపం చేశాం



నాకు గత ప్రభుత్వంలో పుట్టపర్తి సమీపంలోని బ్రాహ్మణపల్లి దగ్గర స్థలం ఇచ్చి ఇంటిని మంజూరు చేశారు. అయితే ఆర్థిక పరిస్థితులు బాగోలేక నేను ఇంటి నిర్మాణం చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం కొత్తగా ఎంపిక చేసే వారికి రూ.4 లక్షలు ఇస్తామని చెబుతోంది. పెంచిన మొత్తం మాకూ ఇవ్వాలి. నిర్మాణ సామగ్రి ఎవరికైనా ఒకటే కదా.. పాత కొత్త అని భేదం చూపితే మాలాంటి వారంతా ఇబ్బంది పడతారు. – మేదర లక్ష్మి, పుట్టపర్తి

రూ.4 లక్షలు వర్తింపజేయాలి



గత ప్రభుత్వంలో నాకు ఇల్లు మంజూరు చేశారు. వివిధ కారణాలతో అప్పట్లో ఇంటి నిర్మాణం పూర్తి చేయలేకపోయా. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొత్తగా ఇల్లు నిర్మించుకునే వారికి రూ.4 లక్షలు ఇస్తామని చెబుతోంది. అలాకాకుండా నాలాంటి వారందరికీ రూ.4 లక్షలు అందించి ఇంటి నిర్మాణానికి సహకారం అందించాలి.
– రమాదేవి, పరిగి మండలం

బిల్లులు ఇవ్వండి



నేను వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి నిర్మాణం ప్రారంభించా. ప్రస్తుతం నిర్మాణం పూర్తి కావొచ్చింది. ఎన్నికల కోడ్ రావడంతో అప్పట్లో బిల్లులు ఆగిపోయాయి. నాకు ఇంతవరకూ రూ.28 వేలు మాత్రమే బిల్లు అయ్యింది. మాకు బిల్లులు ఇవ్వకుండా కొత్తవారికి రూ.4 లక్షలు ఇస్తామనడం సరికాదు. కొత్తగా మంజూరు చేసే ఇళ్లకు ఎంతైనా ఇవ్వండి. కానీ మొదట ప్రాధాన్యతగా పాత బిల్లులు చెల్లించాలి. ఆ తర్వాత కొత్తవి మంజూరు చేయాలి.
– డి.నాగవేణి, కుసుమవారిపల్లి, ఓడీచెరువు

విధి విధానాలు రావాల్సి ఉంది



కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారికి రూ.4 లక్షలు ఇస్తామని కూటమి ప్రభుత్వం చెప్పినట్లు సమాచారం ఉంది. అయితే దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి విధి విధానాలు రాలేదు. ప్రభుత్వం స్పష్టత ఇచ్చాక పూర్తి వివరాలు తెలుస్తాయి. గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై మధ్యలో ఆగిపోయిన వారు, పునాదులు కూడా వేసుకోలేని వారు నిర్మాణాలు చేసుకోవచ్చు. అలా నిర్మించుకున్న వారికీ బిల్లుల చెల్లింపులు జరుగుతాయి. ఇందులో ఎలాంటి సందేహమూ లేదు.
– వెంకటనారాయణ, హౌసింగ్ పీడీ

పెండింగ్ అర్జీలన్నీ వెంటనే పరిష్కరించాలి



అమరావతిలో సీఎంతో సమావేశమైన కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న

- టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం

పుట్టపర్తి అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నెలన్నర పరిధిలో 1,084 అర్జీలు అందాయి. అందులో ఇప్పటి వరకూ 109 పరిష్కరించారు. మరో 975 అర్జీలను పెండింగ్‌లో ఉంచారు. కదిరి, ధర్మవరం రెవెన్యూ డివిజన్లలోనే ఎక్కువగా అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. వెంటనే సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇందులో ఏమాత్రం అలసత్వం వహించినా చర్యలు తప్పవు' అని కలెక్టర్ చేతన్ అధికారులను హెచ్చరించారు. మంగళవారం ఆయన, ఎస్పీ రత్నతో కలిసి అమరావతిలో సీఎం చంద్రబాబును కలిశారు. అనంతరం జిల్లాలోని అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజా సమస్యలపై అందే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యంగా మంత్రులు, ప్రజా ప్రతినిధులు, సీఎం కార్యాలయం నుంచి వచ్చే వినతులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రెవెన్యూకు సంబంధించిన సమస్యలను తహసీల్దార్, వీఆర్‌ఓలు వెంటనే పరిష్కరించాలన్నారు. అందే ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఏదైనా కారణంతో అర్జీని తిరస్కరిస్తే ఏ రూల్ ప్రకారం తిరస్కరించామో ఫిర్యాదుదారునికి స్పష్టంగా తెలపాలన్నారు. దినపత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలపై ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్పందించాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ అభిషేక్‌కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్‌ఓ కొండయ్య, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఖాకీల 'పచ్చ' పాతం

- చిలమత్తూరులో టీడీపీ నేతలపై ఏఎస్‌ఐ స్వామి భక్తి
- దాడి చేశారని రక్తగాయాలతో వచ్చిన బాధితులతో దురుసు ప్రవర్తన
- కేసు కట్టకుండా వేధింపులు
- న్యాయం జరిగేవరకూ వెళ్లబోమన్న బాధితులు
- ఎట్టకేలకు కేసు నమోదుకు చర్యలు



మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో స్టేషన్‌లోనే వేచి చూస్తున్న బాధిత కుటుంబం

చిలమత్తూరు: కూటమి అధికారంలోకి వచ్చిన రోజు నుంచీ జిల్లాలో టీడీపీ నేతల దౌర్జన్యాలు, అకృత్యాలు పెరిగిపోయాయి. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు, నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని భౌతికదాడులకు దిగుతున్నారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులూ టీడీపీ నేతలపై స్వామిభక్తి చాటుతూ బాధితులపైనే రుబాబు చేస్తున్నారు. తాజాగా చిలమత్తూరు మండలంలోని దేమకేతేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు గోపాలప్ప, ఆయన భార్య శాంతమ్మలపై సోమవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు అంజినప్ప, ఆయన బంధువులు దాడికి తెగబడ్డారు. కొడవళ్లతో దాడి చేసి గాయపరిచారు. మహిళ అని చూడకుండా శాంతమ్మపై ఇష్టానుసారం దాడి చేసి గాయపరిచారు. తమ స్థలాన్ని ఆక్రమించేందుకు చూసిన టీడీపీ కార్యకర్తలపై తిరగబడినందుకు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయపడిన అంజినప్ప, శాంతమ్మ సోమవారం రాత్రి ఆస్పత్రిలో చేరి చికిత్స చేయించుకున్నారు. మంగళవారం ఉదయమే రక్తపు మరకలతోనే వారు పోలీసు స్టేషన్‌కు వెళ్లి టీడీపీ కార్యకర్తలైన అంజినప్ప, ఆయన బంధువులపై ఫిర్యాదు చేయగా, పోలీసులు పట్టించుకోలేదు. పైగా ఏఎస్‌ఐ సుబ్రహ్మణ్యం బాధితుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. టీడీపీ నేతల సూచన మేరకు 'కేసు ఇప్పుడు కుదరదు, రేపు ఉదయం రండి' అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారు. దీంతో ఉదయం స్టేషన్‌కు వచ్చిన బాధితులు, వారి కుటుంబీకులు రాత్రి 8 గంటల వరకూ అక్కడే వేచి చూశారు. కేసు నమోదు చేసేంతవరకూ తాము స్టేషన్‌లో ఉంటామని భీష్మించడంతో తూతూ మంత్రంగా కేసు నమోదు చేశారు. కొడవలితో దాడి చేసి చంపాలని చూశారని బాధితులు ఫిర్యాదు చేయగా... ఏఎస్‌ఐ మాత్రం ఆ దిశగా కేసు నమోదు చేయలేదు. ఈ కేసు వివరాలు తెలుసుకునేందుకు వెళ్లిన విలేకరులపైనా ఏఎస్‌ఐ అక్కసు వెళ్లగక్కారు. స్టేషన్‌లో మీకేం పని, స్టేషన్ బయట ఉండాలని రుబాబు చేశారు.

ఎమ్మెల్యే కార్యాలయం నుంచే ఆదేశాలు

నియోజకవర్గంలో టీడీపీ నేతలు అమాయకులపై దాడి చేయడం... ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి పోలీసులపై ఒత్తిడి తీసుకురావడం మామూలైపోయింది. ఏ ఘటన జరిగినా టీడీపీ కార్యకర్తలపై కేసు పెట్టకూడదని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి పోలీసులకు ఆదేశాలు వచ్చినట్టుగా తెలుస్తోంది. ఎప్పుడూ లేనంతగా టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ సానుభూతి పరులు, నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులు చేస్తుండటం... పోలీసులు పట్టించుకోకపోవడంతో నియోజకవర్గంలో అరాచకం రాజ్యమేలుతోంది.

లెసన్ ప్లాన్ రోజూ ఉండాల్సిందే

- ఎంఈఓలు, డీవైఈఓలు మనసు పెట్టి పనిచేయాలి
- రెండుమూడు రోజుల్లో టీచర్ల సర్దుబాటుపై స్పష్టత
- పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్



మాట్లాడుతున్న పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్

అనంతపురం ఎడ్యుకేషన్: లెసన్ ప్లాన్ ప్రతి రోజూ ఉండాల్సిందేనని పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ స్పష్టం చేశారు. మండల విద్యాశాఖ అధికారులు, డిప్యూటీ డీఈఓలు మనసు పెట్టి పని చేయాలని సూచించారు. మంగళవారం స్థానిక పంగల్‌రోడ్డు సమీపంలోని ఆర్డీటీ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ స్కూల్‌లో ఉమ్మడి జిల్లాలోని డెప్యూటీ డీఈఓలు, మండల విద్యాశాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ విద్యాశాఖలో ఎంఈఓలు, డీవైఈఓలు యాక్టివ్ రోల్ పోషించాల్సి ఉంటుందన్నారు. వారి పరిధిలోని అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్గి ఉండాలన్నారు. ప్రతిఫోనూ లిఫ్ట్ చేసి మాట్లాడాలన్నారు. స్టూడెంట్ కిట్లను పరిశీలించాలన్నారు. షూ సైజుల్లో తేడా ఉండకూడదన్నారు. ఒకటికి రెండుసార్లు పరిశీలించి కరెక్ట్ సైజు షూలే ఇవ్వాలన్నారు. ప్రతి పాఠశాలలోనూ లెసన్ ప్లాన్ రోజూ ఉండాలని, అందులో టీచరుతో పాటు హెచ్‌ఎం సంతకం కచ్చితంగా ఉండాలన్నారు. రానున్న రోజుల్లో టీచర్ల సర్దుబాటు ఉంటుందన్నారు. రెండు రోజుల్లో స్పష్టత వస్తుందన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిబంధనల మేరకే చేయాలన్నారు. ఈ విషయంలో డీవైఈఓలు, ఎంఈఓలదే బాధ్యత అన్నారు. ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. పదో తరగతి ఫలితాలు ముఖ్యం కాదని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఈఓ వరలక్ష్మి, ఏపీసీ నాగరాజు, డీవైఈఓలు పాల్గొన్నారు.

లేపాక్షి నవోదయ ప్రవేశాలకు దరఖాస్తు

అనంతపురం ఎడ్యుకేషన్: లేపాక్షి నవోదయ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులని అర్హులని పేర్కొన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతుండాలని వెల్లడించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నివసిస్తున్న వారై ఉండాలని, 2013 మే 1 నుంచి 2015 జూలై 31లోపు పుట్టిన పిల్లలు అర్హులని వెల్లడించారు. సెప్టెంబరు 16లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు www.navodaya.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

రూ.11 లక్షల నగదు అపహరణ



మధుసూదన్ ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

కదిరి టౌన్: స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న యామిని మెడికల్ స్టోర్‌లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... కదిరికి చెందిన మధుసూదన్ తన ఇంటి ముందు గదిలో యామిని మెడికల్ స్టోర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి బంధువుల ఊరికి వెళ్లాడు. విషయం గుర్తించిన దుండగులు సోమవారం రాత్రి మెడికల్ స్టోర్ తాళాలు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. అనంతరం ఇంట్లోకి చొరబడి రూ.11 లక్షల నగదు, 2 కిలోల వెండి సామగ్రి అపహరించుకెళ్లారు. మంగళవారం ఇంటికి తిరిగి వచ్చిన మధుసూదన్... చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి ఫిర్యాదు చేయడంతో కదిరి డీఎస్పీ శ్రీలత, సీఐ పుల్లయ్య అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

కళ్యాణదుర్గం రూరల్: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.... కళ్యాణదుర్గంలోని వడ్డే కాలనీకి చెందిన వడ్డే గంగాధర్(45)కు భార్య గంగమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. బేల్దారి పనులతో జీవనం సాగించేవాడు. ఇటీవల అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఆయన కర్నూలులోని ప్రభుత్వాస్పత్రిలో వారం రోజుల పాటు అడ్మిషన్‌లో ఉండి చికిత్స పొందాడు. సోమవారం డిశ్చార్జ్ పొంది ఇంటికి చేరుకున్న ఆయన మంగళవారం ఉదయం కడుపు నొప్పి తీవ్రతను తాళలేక పట్టణ సమీపంలోని ధర్మవరంలో రోడ్డులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళుతున్న వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

- డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి



పోస్టర్లను విడుదల చేస్తున్న డాక్టర్ మంజువాణి, తదితరులు

మడకశిర రూరల్: తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి తెలిపారు. మడకశిర మండలం కల్లుమర్రిలోని పీహెచ్‌సీని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఓపీ వివరాలపై ఆరా తీశారు. గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. వ్యాధులతో బాధపడుతున్న వారికి అక్కడే చికిత్సలు అందించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవంలో పాల్గొని పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మాధుర్య, వినోద్‌కుమార్, సీహెచ్ఓ హుస్సేన్, సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

మోగనున్న బాజాభజంత్రీలు

- శ్రావణం రాకతో మొదలైన పెళ్లిళ్ల సీజన్
- నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా పెళ్లి సందడి
- 28తో ముగియనున్న ముహూర్తాలు



కదిరి: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పెళ్లిళ్ల సీజన్ రానే వచ్చింది. మూడు నెలల విరామం తర్వాత మూడు ముళ్ల బంధానికి ద్వారాలు తెరుచుకున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా బాజా భజంత్రీలు మోగనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 28 నుంచి శుక్ర మూఢమికి తోడు గురు మూఢమి రావడంతో వివాహాలకు బ్రేక్ పడిన విషయం తెలిసిందే. అయితే శ్రావణం రావడంతో శుభ ముహూర్తాల్లో పెళ్లిళ్లతో పాటు గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు తదితర కార్యక్రమాలు ఊపందుకున్నాయి. అలాగే ఈ నెల 9న నాగుల పంచమి, 16న వరలక్ష్మి వ్రతం, 19న రాఖీ పౌర్ణమి, 27న కృష్ణాష్టమి పండుగలు ఉండడంతో పల్లెలతో పాటు పట్టణాల్లోనూ పండుగ సందడి నెలకొంది.

ఈ నెలలో శుభ ముహూర్తాలు ఇవే

ఈ నెల 7వ తేదీ నుండి 28వ తేదీ వరకూ మంచి ముహూర్తాలు ఉన్నాయని వేద పండితులు అంటున్నారు. ఈ నెల 7, 8, 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28వ తేదీలు వివాహాలకు మంచి శుభ ముహూర్తాలని చెబుతున్నారు. వీటిలో 17, 18వ తేదీల్లో దివ్యమైన ముహూర్తాలున్నాయంటున్నారు. మూడున్నర నెలలుగా ఎదురు చూస్తున్న వారంతా ఈ శుభ ముహూర్తాల్లో వారికి అనుకూలమైన తేదీలను నిర్ణయించుకొని పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, శంకుస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఇప్పటికే సన్నద్ధమయ్యారు. దాదాపు 105 రోజులు శుభ కార్యాలకు మంచి ముహూర్తాలు లేకపోవడంతో చాలామంది ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇప్పుడు మళ్లీ సీజన్ రావడంతో శుభ కార్యాల్లో పాలు పంచుకునే పురోహితులు, బ్యాండుమేళం, ఫొటో, వీడియో గ్రాఫర్లు, ఈవెంట్ మేనేజర్లు, ప్రింటింగ్ ప్రెస్, బ్యూటీపార్లర్ నిర్వాహకులు, దుస్తులు, కిరాణా దుకాణాదారులు, పండ్లు, పూల వ్యాపారులు, క్యాటరింగ్‌తో పాటు నగల వ్యాపారులు ఈ మాసంలో చాలా బిజీగా గడపనున్నారు.

పెరిగిన ఖర్చులు

డిమాండ్‌ను బట్టి కల్యాణ మంటపాల అద్దెను నిర్వాహకులు బాగా పెంచారు. క్యాటరింగ్ సైతం 30 నుంచి 50 శాతం వరకూ పెరిగింది. బ్యాండు మేళం రూ.10వేలు ఇస్తేగానీ రానంటున్నారు. ఫొటోలు, వీడియోలు తీయాలంటే ఎంత తక్కువన్నా రూ.లక్ష అడుగుతున్నారు. పెళ్లి కుమార్తెను అలంకరించాలంటే గంటకు రూ.10 వేల నుంచి రూ.15వేలు ఇవ్వాల్సిందేనని బ్యూటీషియన్లు డిమాండ్ చేస్తున్నారు. ఇక రవాణా ఖర్చులూ రెట్టింపు అయ్యాయి. కళ్యాణమంటపాల డెకరేషన్‌కు సింపుల్‌గా లెక్కేసుకున్నా.. రూ.1లక్షకు తక్కువ కాదని తెలుస్తోంది.

రానుంది శూన్యమాసం



సెప్టెంబర్ 4వ తేదీ నుంచి మళ్లీ శూన్య మాసం రానుంది. దీంతో ఆ మాసంలో శుభకార్యాలు తలపెట్టే అవకాశం లేదు. మొత్తంగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సరైన ముహూర్తాలు లేక శుభ కార్యాలకు బ్రేక్ పడింది. ఇప్పుడు శ్రావణంతో పెళ్లిళ్ల సీజన్ మొదలైంది. ఆగస్టు తర్వాత అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో మాత్రమే శుభ ముహూర్తాలు ఉన్నాయి.

– నరసింహాచార్యులు, అర్చకుడు, ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం

ఈసారి పెళ్లిళ్లు తక్కువే



వాస్తవం చెప్పాలంటే ఈ ఏడాది పెళ్లిళ్లు తక్కువే. ఈ శ్రావణ మాసంలోనూ 10, 12 రోజులు మాత్రమే పెళ్లిళ్లకు మంచి రోజులున్నాయని చెబుతున్నారు. పెళ్లి సీజన్ ఉంటేనే మాకూ చేతి నిండా పని ఉంటుంది. మిగిలిన రోజుల్లో ఖాళీగా ఉండాల్సిందే. టెక్నాలజీ పెరగడంతో మాతో పనిలేకుండా ఖరీదైన సెల్‌ఫోన్లు, కెమెరాలతో ఎవరికి వారు ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నారు.

– చంద్ర, ఫొటో స్టూడియో యజమాని, కదిరి

ప్రియురాలిపై హత్యాయత్నం

- పెట్రోల్ పోసి నిప్పంటించిన ప్రియుడు
- నెల రోజుల క్రితం ప్రియుడిపై హత్యాయత్నం చేసిన బాధితురాలు



బాధితురాలితో ఫిర్యాదు స్వీకరిస్తున్న సీఐ శ్రీనివాసులు

రాయదుర్గం టౌన్: వివాహేతర సంబంధం తెచ్చిన తంటా ఆ ఇద్దరి మధ్య విభేదాలకు దారి తీసింది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు పెట్రోల్ పోసుకుని నిప్పు పెట్టుకునే స్థాయికి చేరుకున్నారు. నెల రోజుల క్రితం ప్రియురాలు హత్యాయత్నం చేయగా... తాజాగా ఆమెపై ప్రియుడు పెట్రోల్ పోసి నిప్పు పెట్టాడు. ఘటనలో దాదాపు 60 శాతానికి పైగా కాలిన గాయాలతో క్షతగాత్రురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వివరాలు.... రాయదుర్గంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో నివాసముంటున్న 40 ఏళ్ల వయసున్న పార్వతి భర్తను విడిచి తన కుమార్తెతో కలసి జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో అదే కాలనీలో నివాసముంటున్న తాపీ మేస్త్రీ మోహన్‌తో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం తెలుసుకున్న మోహన్ భార్య ఆయనను నిలదీసింది. కుటుంబంలో గొడవలు మొదలవడంతో పార్వతిని మోహన్ దూరంగా పెడుతూ వచ్చాడు. దీంతో అసహనానికి గురైన పార్వతి గత మే 12న ఇంటికి వెళుతున్న మోహన్‌పై పెట్రోల్ పోసి నిప్పు పెట్టే ప్రయత్నం చేసింది. ఆ సమయంలో ప్రమాదం నుంచి తప్పించుకున్న మోహన్... పార్వతిపై కక్ష పెంచుకున్నాడు. ఆమె బతికి ఉంటే ఎప్పటికైనా తన ప్రాణాలకు ముప్పు తప్పదని భావించిన ఆయన మంగళవారం సాయంత్రం పొదుపు సంఘం సమావేశానికి వెళుతున్న పార్వతిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. చుట్టుపక్కల వారు గమనించి మంటలు ఆర్పి ఆమెను ఆస్పత్రికి చేర్చారు. అప్పటికే 60 శాతం కాలిన గాయాలతో బాధపడుతున్న ఆమెకు ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. సమాచారం అందుకున్న రాయదుర్గం సీఐ శ్రీనివాసులు ఆస్పత్రికి చేరుకుని బాధితురాలితో ఫిర్యాదు స్వీకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎంసీఏ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ఏడాది జూలైలో నిర్వహించిన ఎంసీఏ రెండో సెమిస్టర్ (ఆర్–20) రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ మంగళవారం విడుదల చేశారు. ఫలితాల కోసం కళాశాల అకడమిక్ సెక్షన్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణకాంతి, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి.లలిత కుమారి, డాక్టర్ డి.విష్ణువర్ధన్, విభాగాధిపతులు ప్రొఫెసర్ భువన విజయ, డాక్టర్ కేఎఫ్ భారతి, డాక్టర్ కళ్యాణిరాధ, డాక్టర్ ఎం.రామశేఖర్ రెడ్డి, డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ జి.మమత, అజిత పాల్గొన్నారు.

జంప్ రోప్ క్రీడాకారుడికి ఘనస్వాగతం



విద్యార్థి సంతోష్ నాయక్‌ను అభినందిస్తున్న ప్రిన్స్‌పాల్ ఫయాజ్, ఉపాధ్యాయులు

గుత్తి రూరల్: జపాన్‌లోని కవాసకిలో జరిగిన ఆసియా జంప్‌రోప్ చాంపియన్‌షిప్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన సేవాగడ్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి వి.సంతోష్ నాయక్‌కు ఘన స్వాగతం లభించింది. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం ఒడ్డుకింద తండా గ్రామానికి చెందిన రెడ్డప్పనాయక్, రత్నబాయి దంపతుల కుమారుడు వి.సంతోష్‌నాయక్... గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. పీఈటీ, కోచ్ విజయకుమార్ నాయక్ నేతృత్వంలో జంప్ రోప్ క్రీడపై సాధన చేసిన విద్యార్థి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూలై 24 నుంచి 29 వరకూ జపాన్‌లోని కవాసకిలో జరిగిన జంప్ రోప్ పోటీల్లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించాడు. వ్యక్తి విభాగంలో 12 దేశాల క్రీడాకారులతో తలపడిన సంతోష్‌నాయక్ ఉత్తమ ప్రతిభతో ద్వితీయ స్థానంలో నిలిచాడు. మంగళవారం సేవాగడ్‌కు వచ్చిన సంతోష్‌నాయక్‌ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించి మేళతాళాలు, తప్పెట్లతో ఊరేగించారు. పాఠశాల ప్రిన్స్‌పాల్ ఫయాజ్, పీఈటీ విజయ్‌కుమార్‌నాయక్ అభినందించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు రైతుల ఆత్మహత్య

అనంతపురం జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక వారు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు...

రాయదుర్గం: మండలంలోని టి.వీరాపురం గ్రామానికి చెందిన ఓబన్న (42)కు తనకున్న రెండు ఎకరాలతో పాటు మరో 3 ఎకరాలు కౌలుకు తీసుకుని కొంత కాలంగా వివిధ రకాల పంటల సాగు చేస్తూ వచ్చారు. అయితే చీడపీడలతో పాటు, సరైన దిగుబడులు లేక నష్టాలపాలయ్యాడు. పంటల సాగుకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి రూ.15 లక్షలకు చేరుకుంది. ఇటీవల వడ్డీ వ్యాపారులు తమ అప్పు తీర్చాలంటూ ఒత్తిళ్లు తీవ్రం చేయడంతో మనస్తాపం చెందిన ఆయన మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై రాయదుర్గం సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఓబన్నకు భార్య ఈరమ్మ, ఓ కుమారుడు ఉన్నారు.

కంబదూరు: మండలంలోని రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన దండా వెంకటస్వామి, ప్రమీలమ్మ దంపతుల రెండో కుమారుడు సూరి (29)కి ఐదు ఎకరాల పొలం ఉంది. కొన్నేళ్లుగా వివిధ రకాల పంటల సాగుతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పంట పెట్టుబడులకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి రూ.8 లక్షలకు చేరుకుంది. ఈ మొత్తాన్ని ఎలా తీర్చాలో తెలియక మదనపడుతున్న ఆయన జీవితంపై విరక్తితో మంగళవారం పొలంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కంబదూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, సూరికి భార్య మంజుల, ఇద్దరు కుమారులు ఉన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి

- ఆర్జేడీకి విన్నవించిన యూటీఎఫ్ నాయకులు



ఆర్జేడీ శామ్యూల్‌కు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం అర్బన్: జీఓ 117ను వెంటనే రద్దు చేయడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్‌కు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి విన్నవించారు. ఈ మేరకు అనంతపురంలోని ఆర్డీటీ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ స్కూల్‌లో మంగళవారం ఆర్జేడీని ఆయన కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. జీఓ 53 ప్రకారం టీచర్లను కేటాయించాలన్నారు. ప్రీ ప్రైమరీతో పాటు ఒకటి నుంచి ఐదు తరగతులు ఒకే పాఠశాలగా నడిపేలా చొరవ తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు కావాలన్నారు. హైస్కూళ్లలో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలన్నారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించి, పని భారం తగ్గించాలన్నారు. హైస్కూళ్లలో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, ఒక కిలోమీటర్ పైబడి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని, స్థానిక ప్రాంతాల పరిస్థితులను బట్టి మధ్యాహ్న భోజనం మెనూ సవరించాలని, మున్సిపల్ టీచర్ల పీఎఫ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో ప్లస్ టు స్కూళ్లను ఏర్పాటు చేయాలని, గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్‌టీలను, భాషా వలంటీర్లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ రామకృష్ణనాయక్, అనిల్‌కుమార్, నాయకులు లక్ష్మయ్య, వెంకటకిషోర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతుడు శ్రీనివాసులు

లేపాక్షి: మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు (34) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. కొండూరు శివారులో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎదురుగా కిలోమీటరు దూరంలో ఉన్న తన పొలం వద్దకు సోమవారం రాత్రి వెళుతున్న సమయంలో బడిసెప్ప తోపు వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య సుభాషిని, 12 ఏళ్ల వయసున్న కుమారుడు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు.

విశ్రాంత డీఎస్పీ ఇంట్లో చోరీ

హిందూపురం అర్బన్: స్థానిక దశరథరామయ్య కాలనీలో నివాసముంటున్న విశ్రాంత డీఎస్పీ గిరిధర్ ఇంట్లో మంగళవారం వేకువజామున దుండగులు చొరబడి విలువైన సామగ్రి అపహరించుకెళ్లారు. నాలుగు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి తన సొంత పనిపై ఆయన ఊరికి వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగి వచ్చారు. అప్పటికే తలుపులు తెరిచి ఉండడం చూసి సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ కంజాక్షన్, ఆధ్వర్యంలో క్లూస్ టీం అక్కడకు చేరుకుని పరిశీలించి, ఆధారాలు సేకరించారు. ఎంత మేరకు సొత్తు చోరీ అయిందనే అంశంపై సాయంత్రం వరకూ పోలీసులకు విశ్రాంత డీఎస్పీ ఫిర్యాదు ఇవ్వకపోవడం గమనార్హం. దీనిపై డీఎస్పీ కంజాక్షన్ మాట్లాడుతూ.. సంఘటనా స్థలాన్ని పరిశీలించామని కొంత బంగారం, వెండి పోయినట్లు గుర్తించామన్నారు. ఎంత అన్నది త్వరలో తెలుపుతామన్నారు.

చిరుద్యోగుల బలవంతపు తొలగింపులు ఆపండి


- వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ

రాప్తాడు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కక్ష కట్టి చిరుద్యోగులతో బలవంతపు రాజీనామాలు చేయిస్తోందని, ఈ చర్యలను వెంటనే ఆపాలని వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐకేపీ, వీఓఏ, మధ్యాహ్న భోజన పథకం, పారిశుద్ధ్య కార్మికులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, స్టోర్ డీలర్లపై సాగిస్తున్న దౌర్జనాలను తక్షణమే ఆపి, వారి ఉద్యోగాలకు భద్రత కల్పించాలన్నారు. చిరు ఉద్యోగులు అడగకుండానే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీతాలు రెట్టింపు చేసి వారు గౌరవంగా జీవించేలా చర్యలు తీసుకుందన్నారు. ఉద్యోగాలను తొలగించడమే కాకుండా భౌతిక దాడులు, మహిళా ఉద్యోగులపై అత్యాచారాలు, అవమానాలకు పూనుకోవడం సిగ్గుచేటన్నారు. వీరితో పాటు స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్ – ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా భయంభయంగా బతికే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 2,600 మంది ఆరోగ్య మిత్రులు ఇతర సేవలను చేస్తున్న వారిని తొలగించడానికి కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకున్నదని, ఇలాంటి చర్యలను ప్రజాస్వామ్యవాదులందరూ ముక్తకంఠంతో ఖండించి బాధితులకు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు.

ధర్మవరంలో చైన్ స్నాచింగ్

ధర్మవరం అర్బన్: స్థానిక కాలేజీ సర్కిల్‌లో నడుచుకుంటూ వెళుతున్న మహిళ మెడలో బంగారు గొలుసును దుండగుడు అపహరించుకెళ్లాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనకు సంబంధించి బాధితురాలు తెలిపిన మేరకు.. ధర్మవరానికి చెందిన పాపమ్మ ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో స్టోర్ బియ్యం తెచ్చుకునేందుకు కాలేజీ సర్కిల్‌లో వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన దుండగుడు ఆమె మెడలోని రెండున్నర తులాల బరువున్న బంగారు గొలుసును లాక్కొని ఉడాయించాడు. ఘటనపై బాధితురాలు సోమవారం అందజేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పంపనూరులో ప్రారంభమైన 'శ్రావణ' ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి క్షేత్రంలో శ్రావణ మాస ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. సందర్భంగా స్వామి వారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించి, వెండి, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8వ తేది నుంచి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ అక్కిరెడ్డి తెలిపారు. ఈ నెల 10న కల్యాణోత్సవం ఉంటుందన్నారు. 25న అన్నాభిషేకం, సెప్టెంబర్ 1న సర్పసూక్త హరిద్రాభిషేకము, అశ్లేషాబలి కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కాగా, శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగనంలో పూజా సామగ్రి విక్రయ హక్కులకు బుధవారం వేలం పాట నిర్వహించనున్నారు. దేవదాయ శాఖ నిబంధనల మేరకు వేలం ప్రక్రియ చేపట్టనున్నట్లు ఈఓ అక్కిరెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు బుధవారం ఉదయం 10 గంటల్లోపు ఆలయంలో ఉండాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన బాలుర జట్టుతో నిర్వాహకులు

పుట్టపర్తి: త్వరలో గుంటూరు వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు సంబంధించి ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ముగిసింది. మంగళవారం బుక్కపట్నంలోని జెడ్పీహెచ్ఎస్ క్రీడామైదానంలో చేపట్టిన ఈ ప్రక్రియను జిల్లా షూటింగ్ బాల్ అసోషియేషన్ సెక్రటరీ మనోహర్‌రెడ్డి, బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం జగదీశ్వర్, సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ వెంకటేశ్వరప్రసాద్, ఉమ్మడి జిల్లా పీడీలు పర్యవేక్షించారు. బాలుర జట్టులో వరదరాజులు, షాషావలి, సమీర్, షాహిద్, జగన్‌మోహన్, సుధీర్, నందకిషోర్, జగన్, సంతోష్, సుకుమార్, పవన్ కుమార్, హర్ష, మనోజ్‌కుమార్, దాదాపీర్, బిజ మనోజ్‌కుమార్, అచ్యుత్ ప్రసాద్, బి.సంతోష్‌కుమార్, కార్తీక్‌నాయక్, సాయికుమార్, తరుణ్, సాద్,వ రుణ్, కేదార్‌నాథ్ చోటు దక్కించుకున్నారు. అలాగే బాలిక జట్టుకు బి.మహేశ్వరి, అనిత, హర్షిత, చిన్ని కుమారి, సుస్మిత, స్రవంతిబాయి, పల్లవి, హిమబిందు, త్రినయని, నిఖిత, సాయిశ్రీజ, శిరీష, స్నేహలత, విజయలలిత, చందన, లక్ష్మి, రితిక, అమృత, వర్షిణి ఎంపికయ్యారు.

భర్తను హతమార్చిన భార్య



సేవ్యానాయక్ మృతదేహం

గుంతకల్లు రూరల్: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడన్న అక్కసుతో కట్టుకున్న భర్తనే హతమార్చిన ఘటన గుంతకల్లు మండలంలో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం గుండాల తండాకు చెందిన సేవ్యానాయక్ (45), లలితమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. తమకున్న మూడెకరాల పొలంలో వ్యవసాయంతో పాటు కూలి పనులు, బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కొంత కాలంగా లలితమ్మ అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నట్లుగా గుర్తించిన సేవ్యానాయక్ పలుమార్లు ఆమెను మందలించాడు. దీంతో తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయాన్నే కూలి పనుల నుంచి తిరిగొచ్చిన లలితమ్మ మధ్యాహ్నం తమ పొలం వద్దకెళ్లింది. కాసేపటి తర్వాత కూలి పనుల నుంచి ఇంటికి చేరుకున్న సేవ్యానాయక్... తన భార్య పొలానికి వెళ్లిన విషయం తెలుసుకుని ఆమెకు సద్ది తీసుకుని బయలుదేరాడు. సాయంత్రం రక్తపు మరకలున్న బట్టలతో ఒంటరిగా ఇంటికి చేరుకున్న లలితమ్మ... స్నానం చేసి ఆ దుస్తులను ఉతికి ఆరవేసింది. రాత్రి 10.30 గంటలైనా సేవ్యానాయక్ ఇంటికి రాకపోవడంతో పిల్లలు, ఇంటి పక్కనే ఉన్న సేవ్యానాయక్ అన్నదమ్ములు ఆందోళనకు గురయ్యాడు. విషయంపై లలితమ్మను గట్టిగా నిలదీయడంతో తానే రాళ్లతో కొట్టి సేవ్యానాయక్‌ను హతమార్చినట్లు ఆమె తెలపడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు గుండాల తండాకు చేరుకుని లలితమ్మను విచారణ చేశారు. అనంతరం ఆమెను వెంటబెట్టుకుని రాత్రి 11.30 గంటలకు పొలం వద్దకెళ్లి సేవ్యానాయక్ మృతదేహాన్ని గుర్తించారు. నిందితురాలిని అదుపులోకి తీసుకుని ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు గుంతకల్లు రూరల్ సీఐ మహేశ్వర రెడ్డి, ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.